www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 అక్టోబర్ 2024
5
వైఎస్ఆర్

రేపటి నుంచి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారిశాల – 2024 దసరా ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 13 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ పి.వి. రమణ తెలిపారు. మంగళవారం ఆలయ మండపంలో దసరా ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3న దీక్షా బంధన దేవి అలంకారం, 4న రాజరాజేశ్వరి దేవి అలంకారం, 5న అన్నపూర్ణ దేవి అలంకారం, 6న శ్రీ గజలక్ష్మి దేవి అలంకారం, 7న మోహిని దేవి అలంకారం, 8న త్రిపుర సుందరి దేవి అలంకారం, 9న సరస్వతి దేవి అలంకారం, 10న మహిషాసుర మార్థిని దేవి అలంకారం, 11న వాసవి కన్య కాపరమేశ్వరి అలంకారం, బిందెసేవ రోజు ప్రత్యేక ఆకర్షణగా కర్ణాటక నుంచి గజరాజు (ఏనుగు) పైన అమ్మవారి ప్రతిమతో ఊరేగింపు ఉంటాయని పేర్కొన్నారు. 12న విజయలక్ష్మి దేవి అలంకారం, 13న దోలాధిరోహణ పవలింపు సేవ ఉంటుందని తెలిపారు.

ఇక ప్రయివేట్ కిక్కు!



ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ అమలు

జిల్లా వ్యాప్తంగా 139 దుకాణాలు ఎంపిక

దరఖాస్తుల ఆహ్వానంలో ఎక్సైజ్ శాఖ

సిండికేట్‌కు నేతల యత్నాలు

ప్రజాశక్తి – కడప ప్రతినిధి

జిల్లాలో మద్యం టెండర్ల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ప్రభుత్వం మంగళవారం రాత్రి నూతన మద్యం పాలసీని ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లా ఎక్సైజ్‌శాఖ దరఖాస్తుల ఆహ్వానానికి రంగం సిద్ధం చేసింది. జిల్లా రాజకీయ నాయకత్వం తమ అనుచరులకు మద్యం దుకాణాలు దక్కేలా చక్రం తిప్పే ప్రయత్నాల్లో నిమగ్నమైంది. జిల్లాలోని మద్యం షాపులకు దాఖలు చేసే దరఖాస్తుదారులను సిండికేట్ చేయడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఓ వినూత్న ప్రయోగాన్ని అమలు చేస్తోంది. మద్యం వ్యాపారంలో అనుభవం కలిగిన ఓ వ్యాపారిని ఎంపిక చేసుకుంది. ఈయన దరఖాస్తుదారులను సంప్రదించి ఒక్కో దుకాణానికి అధికార పార్టీకి చెందిన నలుగురు, ఐదుగురుతోనే దరఖాస్తులు దాఖలు చేయించే ప్రయత్నం చేస్తోంది. ఏఒక్కరికి లాటరీ దక్కినా తాను ఎంపిక చేయబడిన అనుచరులకు కట్టబెట్టే ప్రయత్నాల్లో నేతలు నిమ్నగమైట్లు తెలుస్తోంది.

జిల్లాలో నూతన మద్యం విధానం అమలు కానుంది. జిల్లా ఎక్సైజ్ శాఖ ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలు ఆదేశాల మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 139 మద్యం దుకాణాలకు సంబంధించిన దరఖాస్తులను ఆహ్వానించింది. కడప మండల పరిధిలో 30, సిద్ధవటం 8, ముద్దనూరు 7, ఎర్రగుంట్ల 14, ప్రొద్దుటూరు 14, జమ్మలమడుగు 19, పులివెందుల 16, మైదుకూరు 16, బద్వేల్ 15 చొప్పున మద్యం దుకాణాలు నిర్వహించడానికి కసరత్తు ముమ్మరం చేసింది. దరఖాస్తులను సైతం ఆహ్వానించింది. దరఖాస్తుల దాఖలు చేయడానికి తొలి రోజు మంగళవారం కావడంతో దరఖాస్తులు దాఖలు చేయడానికి ఆశించిన రీతిలో మొగ్గు చూపలేదని తెలుస్తోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలు అమలు నేపథ్యంలో ఆన్‌లైన్‌లో కొన్ని దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. రెండేళ్ల పాటు నూతన పాలసీ అమలు నిబంధనల నేపథ్యంలో లైసెన్స్, టెండర్లలో పాల్గొనడానికి ఫీజుల చెల్లింపుల వ్యవహారం తదితర పనుల్లో నిమగ్నమైనట్లు సమాచారం.

సిండికేట్..కుతంత్రం..!

నూతన మద్యం పాలసీ అమలు నేపథ్యంలో అధికార పార్టీ నాయకత్వం మద్యం దుకా ణాలను దక్కించుకోవడంపై దృష్టి సారించింది. తొలిరోజు నుంచే ప్రతిపక్ష పార్టీ నుంచి ఎవరు దరఖాస్తులు చేస్తున్నారనే అంశంపై దృష్టి సారించింది. జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలను తమ అనుచరులకే దక్కేలా చేయడంపై అధికార పార్టీ నాయకత్వం కన్నేసింది. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతి నిధులను ఆశావహులు ఆశ్రయించినట్లు తెలుస్తోంది. కడప మండల పరిధిలోని 30 మద్యం దుకాణాలను దక్కించుకుకోవడం అధికార పార్టీ కన్నే సింది. కడప నగరంలో మద్యం వ్యాపారంలో అనుభవం కలి గిన ఓ అనుభవజ్ఞునికి సిండికేట్ బాధ్యతలు అప్పగించిందనే చర్చ ప్రచారంలో ఉంది.

కడపలో ప్రీమియం స్టోర్?

రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ప్రీమియర్ స్టోర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన సంగి తెలిసిందే. కడప నగరంలోనూ ఒక ప్రీమియర్ స్టోర్ కలిగిన మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయాలనే అంశం ప్రతిపాదనల్లో ఉంది. నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ప్రీమియర్ స్టోర్ ఏర్పాటు సదుపాయానికి లైసెన్స్ ఫీజులు, దరఖాస్తు ఫీజులు పెద్దమొత్తంలో చెల్లించాల్సి ఉంది. ప్రతి ఏటా 10 శాతంపైగా ఫీజులు పెంచనున్నట్లు తెలిపింది. ఈనెల ఒకటి నుంచి 11వ తేదీ వరకు దాఖలు చేసిన దరఖాస్తుదారులను సంప్రదించి సిండికేట్ చేసే బాధ్యతల్లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. అనంతరం 12 నుంచి మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది.

బకాయిల భేరీ..!

రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలోని 124 ప్రభుత్వ మద్యంషాపుల ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ప్రతి దుకాణానికి ముగ్గురు నంచి ఐదుగరు చొప్పున ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమల్లో భాగంగా ప్రయివేటు వ్యక్తులకు మద్యం దుకాణాలను అప్పగించడంపై ఆందోళన నెలకొంది. తాజాగా బద్వేల్ మండల పరిధిలోని మద్యం దుకాణాలకు చెందిన పలువురు ఉద్యోగులు ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన వేతన బకాయిలను పరిస్థితేమిటని నిలదీస్తోంది. బకాయని ఎవరు చెల్లిస్తారో చెప్పాలని ఆందోళనకు దిగింది. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి తరహా పరిస్థితి నెలకొంది.

నూతన మద్యం పాలసీ వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి - ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

32 మంది ప్రాణ బలిదానంతో ఏర్పాటు అయిన విశాఖ ఉక్కును ప్రయివేట్ పరం చేయాలని కేంద్రం చూస్తోందని, విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కును ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు విద్యార్థి,యువజన సంఘాల నాయకులు మండిపడ్డారు. సోమవారం విశాఖ ఉక్కు ప్రయివేటేకరణ ఆపాలని, కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా కడపలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు.రాహుల్, వీరపోగు.రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు, కడప ఉక్కు పై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. నాడు విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించి సాధించుకున్న విశాఖ ఉక్కును నేడు నష్టాలు వస్తున్నయన్న సాకుతో కార్పొరేటు శక్తులకు అమ్మే కుటిల ప్రయత్నాలు బిజెపి పభుత్వం చేస్తుందని విమర్శించారు. ప్రాణాలర్పించైనా ప్రయివేటీకరణ అడ్డుకుంటామని హెచ్చరించారు. విభజన హామీలో చట్టబద్ధంగా రాసుకున్న కడప ఉక్కుని సైతం కేంద్రం పక్షపాత ధోరణితో చూస్తూ నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో కరువుతో, వలసలతో అల్లడిపోతుంటే పాలకులకు కనపడటం లేదన్నారు. వలసల నివారణకు కడప ఉక్కు పరిశ్రమే ఏకైక మార్గమన్నారు. ఇక్కడ చదువుకున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలసలు పోతున్నారన్నారు. అదే ఇక్కడ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే చదువుకున్న యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. గడిచిన పార్లమెంట్ సమావేశాల్లో బిజెపి ప్రభుత్వం కడప ఉక్కు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం ఈ ప్రాంత ప్రజలపై ఎంత వివక్షత ఉందో అర్థమవుతుందన్నారు. కనీసం ఈ ప్రాంత ఎంపీలు సైతం కడప ఉక్కు కోసం పోరాటం చేయకపోవడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని లేకుంటే రాబోవు రోజులలో విద్యార్థులు, యువకులతో పెద్ద ఎత్తున పోరాటాలకు నాంది పలుకుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు నిర్మల్, నగర కన్వీనర్ విజయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు అభినయ్ పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

ఓటర్ల ప్రత్యేక జాబితాను సిద్ధం చేస్తున్నాం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా – 2025ను ఎలాంటి పెండింగ్ లేకుండా సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ శివశంకర్ లోతేటి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్‌కు తెలియజేశారు. మంగళవారం రాజధాని అమరావతి నుంచి ఎస్ఎస్ఆర్ – 2025, రేష లైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్స్, ఓటర్ల సర్వే ప్రక్రియ వంటి అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి లెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హాజరయ్యారు. సిఇఒ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2025 పురో గతిని జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ హౌస్‌టు హౌస్ ఓటర్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 99.45 పూర్త యిందని చెప్పారు. ఫారం–6 ఫారం–7, ఫారం–8 సంబంధించి 01 జనవరి 2023 నుంచి 25 ఏప్రిల్ 2024 వరకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించగా ఇంకా 4223 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఎస్ఎస్ఆర్ –2025కి సంబంధించి అన్ని నియోజకవర్గాల వారీగా ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు , బిఎల్ఒలకు ఇదివరకే శిక్షణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. స్వీప్ నోడల్ ఆఫీసర్‌గా నూతనంగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ నియమించామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ఒత్తిడి పెరిగితే గుండెకు భారం

ప్రజాశక్తి - కమలాపురం : గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన కారణం ఒత్తిడి అని మనం దానిని జయించినట్లయితే చాలా వరకు హృదయ సంబంధిత వ్యాధుల నుంచి బయటపడవచ్చని పెద్దచెప్పలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మెహరన్ తెలిపారు వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని పెద్దచెప్పలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుండె సంబంధ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని సివి రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడి అధికంగా ఉన్న వారిలో గుండె కొట్టుకునే వేగం ఎక్కువగా ఉంటుందని పరిశోధనలలో తేలిందని, ఒత్తిడిని తగ్గించుకోవడానికి దినసరి ప్రార్థనను అలవారచుకోవడం, ఇష్టమైన పాటలు వినడమో, లేక పుస్తకాలు చదవడమో చేయాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.ఓబులు రెడ్డి మాట్లాడుతూ గుండె జబ్బులు నివారించడానికి సరియైన జీవనశైలిని ఎన్నుకోవాలని, తాజా పళ్ళ కూరగాయలు, తక్కువ కొవ్వు కలిగిన పాల పదార్థాలు, చేపలు, తక్కువ చక్కెర తీసుకోవడం సరియైన నిద్ర వ్యాయామం అలవర్చుకోవాలని తెలిపారు. సివి రామన్ సైన్స్ క్లబ్, కడప డివిజన్ అధ్యక్షులు ఆర్ శ్రీనివాసుల రెడ్డి గుండె సంబంధిత జబ్బులు నివారణ జాగ్రత్తలు ఛాయ ఛాయాచిత్ర ప్రదర్శనను ఏర్పరచి విద్యార్థులకు గుండె సంబంధ వ్యాధులపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వరి ప్రసాదు, కె. ప్రసాద్, రామచంద్ర, సునీల్ ఆరోగ్య కేంద్ర సిబ్బంది జయలక్ష్మి, విజయ కుమారి పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అట్లూరు

ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అట్లూరు విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ చాటుతున్నారు. క్రమ శిక్షణ, నైతిక విలువలతో పాటు విద్యాపరంగా మండల, డివిజన్ జిల్లాస్థాయి పరీక్షలలో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇటీవల జిల్లా విద్యాశాఖ నిర్వహించిన విద్యా దర్శిని టాలెంట్ టెస్ట్‌లో అర్హత సాధించారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లోనూ మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. క్రీడలలో ప్రతిభ ఎస్‌జి ఎఫ్ మండల స్థాయి పోటీలు ఎంపికలలో అండర్ – 14, 17 బాలుర, బాలికల కబడ్డీలోను, అండర్–14 , అండర్ –17 వాలీబాల్ పోటీలలోను ప్రథమ స్థానంతో నిలిచారు. సోమవారం రాయచోటిలో నిర్వహించిన బేస్‌బాల్ అండర్–4, 17 ఎస్‌టిఎఫ్ జట్ల ఎంపికలలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్ లకు విద్యార్థులు రామ్‌చరణ్, ఎస్ .విష్ణువర్ధన్ ఎంపికయ్యారు. విద్యార్థుల ఫలితాల సాధన పట్ల ప్రధానోపాధ్యాయులు అశ్వర్థరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల బోధన సిబ్బందిని అభినందించారు.

ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కడప సిటీ

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా, జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం పురస్కరించుకొని స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, భోగాపార్వతమ్మ సంయుక్త రక్తదాన సంస్థ వారి సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వీర సుదర్శన రెడ్డి కార్యక్రమంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానాన్ని చేసిన 85 మంది విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్‌వి కళాశాలల వైస్ చైర్మన్లు అంబవరం ప్రకాష్, అంబవరం ప్రదీప్ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన బ్యాంక్, భోగాపార్వతమ్మ రక్తదాన సంస్థ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై నాగేంద్ర పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థి

పింఛన్ కోసం వచ్చి
గుండెపోటుతో మహిళ మృతి

ప్రజాశక్తి – వేంపల్లె

కడప జిల్లా వేంపల్లె మండలంలోని పాములూరు గ్రామ సచివాలయ వద్ద ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛను తీసుకున్న కొద్ది నిమిషాల్లోనే మహిళ గుండె పోటుతో మృతి చెందారు. మండలంలోని అమ్మగారిపల్లె గ్రామా నికి చెందిన భోగపతి రాజ్యలక్ష్మి (49) అనే మహిళ వేంపల్లెలోని రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉంటోంది. భోగపతి రాజ్యలక్ష్మి భర్త చనిపోవడంతో వితంతు కింద ప్రభుత్వం పింఛను మంజూరు చేసింది. ప్రతి నెల పాములూరు గ్రామంలోని సచివాలయం వద్దకు వెళ్లి రాజ్యలక్ష్మి పింఛను తీసుకొనేదని మృతురాలి బంధువులు తెలిపారు. మంగళవారం 1వ తేదీ కావడంతో మృతురాలు రాజ్య లక్ష్మి పాములూరులోని గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి పింఛను తీసుకొని సచివాలయ వెలుపలికి వచ్చి మోటర్ బైకు ఎక్కుతుండగా ఒక్క సారిగా కింద పడిపోయి అక్కడక్కడే రాజ్యలక్ష్మి మహిళ మృతి చెందారు. బంధువులకు సమాచారం ఇవ్వడంతో మృతురాలిని బంధువులు వేంపల్లెలోని రాజీవ్ నగర్ కాలనీకి తీసుకొని వెళ్లారు. గ్రామ సచివాలయం వద్ద పింఛను తీసుకొని మహిళ మృతి చెందడంతో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది దిగ్భ్రాంతికి లోనయ్యారు.

మృతి చెందిన రాజ్యలక్ష్మి

చెట్టును ఢీకొన్న ప్రయివేట్ స్కూల్ బస్సు
- పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -కమలాపురం టౌన్

మండలానికి చెందిన ఓ ప్రయివేట్ స్కూల్ బస్సు చెట్టును ఢీకొంది. సంఘటనలో పలువురి విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. కమలాపురం పట్టణానికి చెందిన ఓ ప్రయివేట్ స్కూల్ బస్సు కొండాయ పల్లె వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. చుట్టుపక్కల గ్రామాల చెందిన పలు విద్యార్థులకు గాయా లయ్యాయి. పోలీసులు, స్థానికులు సకాలంలో స్పందించి గాయాలైన విద్యార్థులను దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. ఘటనలో మాచిరెడ్డిపల్లెకు చెందిన వెంకట హరీష, సురేంద్ర కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. పాఠశాల యాజమాన్యం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం చేస్తున్నారు. కాలం చెల్లిన బస్సు లను నడపడం వల్లనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు కూడా పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు

సిసి రోడ్డు పనులు అడ్డుకున్న మహిళలు

ప్రజాశక్తి-కలసపాడు

జెసిబిని అడ్డుకుంటున్న కాలనీ వాసులు, మహిళలు

పేదల స్థలాల్లో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను మహిళలు అడ్డుకున్నారు. అవసరం లేని చోట రోడ్డు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో అధికారులు వెనక్కి తగ్గారు. వివరాలు.. మండలంలోని పుల్లారెడ్డిపల్లె ఎస్‌సి కాలనీలో సుమారు 400 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. సర్పంచ్‌గా ఓబులమ్మ ఎన్నికయ్యారు. గత ప్రభుతంలో సచివాలయం, ఆర్‌బికె, సిసి రోడ్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. కొద్ది రోజుల నుంచి సచివాలయానికి రహదారి కావాలని కొందరు సచివాలయ ఉద్యోగుల విన్నపం మేరకు సంబంధితాధికారులు సిసి రోడ్డును మంజూరు చేశారు. పేదల స్థలాలు పూర్తి తొలగించి రోడ్డు వేయడానికి అధికారులు చర్యలు తీసుకోవడంతో కాలనీ వాసులు ఆగ్రహించారు. మంగళవారం జెసిబితో చేపడుతున్న సిసి రోడ్డు పనులను సర్పంచ్, బంధువులు, మహిళలు అడ్డుకున్నారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరం లేని చోట రోడ్లు వేయడం ఏమిటని, అందులో తమ స్థలాలు మీదుగా వేయడం సరైంది కాదని, కుల వివక్షత చూపే అధికారుల కోసం తమ సచివాలయంలో అవసరం లేదన్నారు. తాము సచివాలయానికి వెళ్తే అధికారులు వివక్షతో చూస్తారని పేర్కొన్నారు. పేదల ఇళ్ల స్థలాల జోలికి వస్తే ఉద్యమిస్తామని కాలనీ వాసులు హెచ్చరించారు.

విశాఖ ఉక్కు కోసం పోరాటం తీవ్రతరం

ప్రజాశక్తి - కడప : విశాఖ ఉక్కు కోసం కాంగ్రెస్ పార్టీ ఇకపై పోరాటాలు తీవ్రతరం చేస్తుందని యువ నేత వెన్నపూస మధురెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు అని అన్నారు. రాష్ట్రంలో 164 సీట్లతో కూటమి సర్కారును గెలిపిస్తే చేసింది ఏమీ లేదన్నారు. ఢిల్లీలో కూడా రాష్ట్ర ఎంపీల మద్దతుతో సర్కారు ఏర్పడిందన్నారు. అటువంటప్పుడు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విశాఖ ఉక్కు వేల కార్మికుల కుటుంబాల భవిష్యత్తుకు సంబంధించిన విషయం అన్నారు. నాలుగు వేల మంది ఉద్యోగులను అడ్డగోలుగా తీసేస్తూ, అటు ఆస్తులు తెగనమ్ముకుంటూ మోసం చేస్తుంటే, కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదు హెచ్చరించారు.

మాట్లాడుతున్న మధురెడ్డి

తల్లిదండ్రులు పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి

ప్రజాశక్తి - కడప : ప్రతి ఒక్కరిలో వృద్ధ తల్లిదండ్రుల పట్ల, పెద్దలపట్ల గౌరవం ఇచ్చి నడుచుకోవాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ స్ సమావేశ హాలులో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజంలో మానవత్వ మనుగడకు నైతిక విలువలు ఎంతో అవసరమని అన్నారు. తల్లిదండ్రులను గౌరవించి నడుచుకోవాలని, వృద్ధాప్యంలో వారిని చక్కగా చూసుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుండే మానవతా విలువలు, సుమతి శతకం, నీతి శతకం, పురాతన కథలను, పురాణాలను, ఇతిహాసాలను, సిద్ధాంతాలను చెప్పాలని అన్నారు. భావితరాల వారికి ఆస్తిని సంపాదించి పెట్టే కంటే నైతిక విలువలను నేర్పాలని అన్నారు. మానవత్వం పరిమళించాలంటే నైతిక విలువలు తెలియాలని చెప్పారు. పాఠశాలల విద్యార్థులకు వారంలో ఒకరోజు సుమతీ శతకం, నీతి శతకం, నైతిక విలువలపై బోధించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నెల రోజులకు ఒక మారు అనాథ, వృద్ధాశ్రమాలలో ఉన్నవారికి కాలలకు తీసుకువెళ్లి ఆహ్లాదకరమైన వాతావరణంలో కాసేపు సేద తీర్చుకునే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ వారసులను, వయో వృద్ధులను, వృద్ధాశ్రమాల హక్కులను సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

డిసిఇబి భవనాన్ని నిర్మించాలి : 'ప్యాఫ్టో'

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడపలో జిల్లా ఉమ్మడి పరీక్షా కేంద్ర భవన (డిసిఇబి) నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాఫ్టో) కడప జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని సిఎస్ఐ హైస్కూల్ ఆవరణలో ఫ్యాప్టో జిల్లా శాఖ సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న డిసిఇబి భవనం గతంలో బుగ్గ వంక విస్తరణ పనులలో కూల్చివేతకు గురైందని పేర్కొన్నారు. అప్పటి నుంచి కార్యక లాపాలను సిఎస్ఐ హైస్కూల్ లో ఒక రూములో నిర్వహిస్తున్నారని తెలిపారు. గతంలో జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు, ఉపాధ్యాయ సంఘాల వినతి మేరకు డిసిఇబి భవనాన్ని నిర్మించుకునేందుకు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో పది సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ జిల్లా పరిషత్ పాలకమండలి తీర్మానం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. డిసిఇబి వద్ద దాదాపు రూ.80 లక్షలు పైబడి నిధులు కూడా ఉన్నాయన్నారు. అయినప్పటికీ భవన నిర్మాణ పనులను ప్రారంభించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపి ంచారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి కడప జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ పనులను ప్రారంభించి, త్వరితగతిన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు ఇదే విద్యా వ్యవస్థలో భాగంగా ఉన్న మున్సిపల్ టీచర్లకు మాత్రం వర్తించడం లేదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా జరగబోవు కార్యాచరణకు సంబంధించిన నోటీసును జిల్లా విద్యాశాఖాధికారి ఎం అనురాధకు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్స్‌లో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరని తెలిపారు. 3,4,5 తరగతులను విలీనం చేశారే తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్‌లను ఇవ్వలేదని చెప్పారు. ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదని, ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. మున్సిపల్ టీచర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కార్యాచరణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్ణయించిందని

ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు
ఉత్తమ పేపర్ అవార్డులు

ప్రజాశక్తి - కడప సిటీ

కడప ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు ఉత్తమ పేపర్ అవార్డులు లభించాయి. గత నెల 27 నుంచి 30 వరకు తిరుపతిలో రాష్ట్ర స్థాయి అనస్థీషియా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో 1250 మంది అనస్థీషియా నిపుణులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి 50 వైద్య కళాశాలల నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు. కడప ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు డాక్టర్ వీరమల్ల పూజ, డాక్టర్ కందాల శ్రీకావ్య, డాక్టర్ అన్నామలై రామమూర్తి, డాక్టర్ ఎం సంధ్యా రాణి, డాక్టర్ శ్రీలేఖ, డాక్టర్ బైబి, డాక్టర్ సందీప్ ఉత్తమ పేపర్ అవార్డులు పొందారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి అవార్డు పొందిన విజేతలకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల కడప విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- గోపవరం

బద్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేల్, గోపవరం, సిద్దవటం, అట్లూరు మండలాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గోపవరం మండల పరిధిలోని చెన్నవరం, రాచాయపేట గ్రామాలలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. నాగరాజు మాట్లాడుతూ పంటల సందర్శన, గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించామని చెప్పారు. పాడిపంటలు, వ్యవసాయ పంచాంగం పంపిణీ చేశామన్నారు. ట్రైకో డెర్మ, సూడో మోనాస్ వాడకం, ప్రకృతి వ్యవసాయ విధానాలు పై రైతులతో చర్చించి సందేహాలను నివృత్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుధారాణి, జ్యోతి, సునంద, విజయ భాస్కర్ రెడ్డి, రైతులు, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు,వ్యవసాయ విస్తరణ అధికార విజయ్ కుమార్, ఓబయ్య ,సాయి కిరణ్, మండల వ్యవసాయ అధికారి కే చంద్ర మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ శివ శంకర్

ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కలెక్టర్ శివ శంకర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో ఖున్ కా రిష్తా ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ రక్తదాతలకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ ఆయన మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాలను ఎలా రక్షించవచ్చో వివరించారు. రోగులు ఈ రక్తదానం వల్ల లబ్ధి పొందుతారని, రక్తదానంలో యువకులు ముందుండాలని పేర్కొన్నారు. ఖున్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ యం.తారిఖ్ అలీ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా కడప లో రక్తదానం చేసిన ఖున్ కా రిష్తా సభ్యులు అభినందనీయులు అన్నారు. శిబిరంలో 40 మంది ఖున్ కా రిష్తా సభ్యులు రక్తదానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి కడప నగర ఉపాధ్యక్షులు పి.మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఒక యువకుడు రక్తదానం పట్ల అవగాహన పొందితే ఎందరో యువకులకు రక్తదానం పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది నరసింహ, నరేష్, హరి,మహేష్, ఖున్ కా రిష్తా ఛారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ గౌస్ సయ్యద్,డైరెక్టర్ అంజాద్, సభ్యులు సమీ, సైఫ్,రక్తదాతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్

ప్రయివేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ విధానాలను పాటించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వ నిబంధనలను ప్రయివేట్ స్కూల్స్, కళాశాలల యాజమాన్యలు పాటించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్న ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలాలు ఈనెల 3 నుంచి 14వ తేదీ వరకు దసరా సెలవులు అమలు చేయాలన్నారు. కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వం చెప్పిన విధి విధానాలను పాటించాలన్నారు. ప్రయివేట్ ఉపాధ్యాయులను వర్క్‌షాప్ పేరుతో ఇబ్బంది పెట్టకుండా వారికి కూడా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సునీల్, నాయకులు సప్తగిరి, గణేష్, యోగేష్, అభినయ్ పాల్గొన్నారు.

వ్యర్థాలతో సంపద సృష్టించొచ్చు

ప్రజాశక్తి - ముద్దనూరు

చెత్త, వ్యర్థాలతో సంపద సృష్టించొచ్చని ఎంపిడిఒ ముకుందారెడ్డి తెలిపారు. మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని డిఎన్ పల్లె వద్ద ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం ఎంపిడిఒ, ఈఓపిఆర్డీ వీరభద్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త, వ్యర్థాలను వృథా చేయవద్దన్నారు. రోడ్లపై వేసిన చెత్తను, వ్యర్థాలను సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించనున్నట్లు తెలిపారు. 12 గ్రామ పంచాయతీల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలకు అన్ని సదుపాయాలు కల్పించి పూర్తిగా వినియోగంలోకి తెస్తామని ఎంపిడిఒ తెలిపారు.

చాపాడు : గ్రామపంచాయితీలకు ఆదాయ వనరులను గ్రామంలోనే సమకూర్చుకోవాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన చాపాడులోని ఎస్‌డబ్ల్యు పిసి సెంటర్‌ను ఆయన పునఃప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, గ్రామ సర్పంచ్ మహబూబ్ బీ, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ, టిడిపి నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి సలీం, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అమ్మవారి అలంకారాల్లో విద్యార్థులు

శ్రీరాజీవ్ హైస్కూల్‌లో ముందస్తు దసరా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక గురవయ్య తోట వీధిలోని శ్రీరాజీవ్ హైస్కూల్ కరస్పాండెంట్ సుధాకర్, చైర్మన్ రాజేష్ ఆధ్వ ర్యంలో మంగళవారం ముందస్తు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సుధాకర్ మాట్లాడుతూ దేశాలు ఏవైనా భారతీయులంతా భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ దసరా అని పేర్కొన్నారు. ప్రపంచం నలుమూలలా అమ్మవారి నవ రాత్రులను ఎంతో ఘనంగా జరుపుకుంటారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భక్తి పాటలకు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతోగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ టెస్సి, సుధా, ప్రియాంక, రాధిక, పద్మావతి, మస్తాన్ బి, సల్మా, డయానా, ప్రసన్న, శిరీష, రహమతున్ని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల గుర్తింపునకు గ్రామసభలు

ప్రజాశక్తి - ఖాజీపేట

రానున్న 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా పనుల గుర్తింపు ప్రణాళికకు సంబంధించి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామసభలకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామపెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు. గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ హెచ్చరించారు.

రేపటి నుంచి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దసరా ఉత్సవాల్లో రెండవ మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో 134వ దసరా ఉత్సవాలు ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షులు బుశెట్టి రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గురువారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు జరుగనున్న ఉత్సవాల్లో పాలకొల్లు బ్యాండ్‌సెట్, కుత్బుల్లాపూర్ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విజయదశమి రోజు హరియానా వారి భంభంభోలే, శక్తిస్వరూపం, కేరళ సింగారి మేళతాళాలతో అమ్మవారు శమీ దర్శనానికి బయలుదేరుతారని వివరించారు. ఈనెల 7,8,9 తేదీల్లో విశేష అభిషేకాలు, హోమాలు, సుహాసిని పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కడప జిల్లా కళాచారిత్రక సాంస్కృతిక వారసత్వ మాసపత్రిక 'మన చరిత'ను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రొద్దుటూరు ఆర్యవైశ్యసభ సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విన్నీలత

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విన్నీలత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు జిల్లా ఆదోని మండలం నుండి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాలకు లాక్ తప్పనిసరి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ద్విచక్ర వాహనదారులు వాటికి తప్పక లాక్ వేసుకోవాలని ఎర్రగుంట్ల సిఐ నరేష్‌బాబు సూచించారు. ఇటీవల కాలంలో సులభ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో, చెడు వ్యసనాలకు అలవాటు పడిన చాలామంది యువకులు ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నారని తెలిపారు. మంగళవారం ఆయన వాహనదారులకు పలు సూచనలు చేశారు. రాత్రివేళల్లో వాహనాలు చోరీకి గురికాకుండా యజమానులు ఇంటి కాంపౌండ్‌లో ఉంచి వాహనానికి, గేట్‌కు తాళం వేయాలన్నారు. కాంపౌండ్ లేనివారు ద్విచక్ర వాహనానికి ముందు చక్రానికి లాక్ వేసుకోవడం వల్ల దొంగతనాలు జరగకుండా నివారించవచ్చు అన్నారు.

చిలమకూరులో ఫుడ్ ఫెస్టివల్

ఎర్రగుంట్ల : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ చిలమకూరు పాఠశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ విద్యార్థినులు ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి దాత చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి 35 మంది ఇంటర్ విద్యార్థులకు యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల తరఫున ఉపాధ్యాయురాలు సావిత్రమ్మ చిరు సన్మానం చేసి, కృతజ్ఞతాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, సూర్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, విమల కుమారి, డేవిడ్ రాజు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎంఇఒ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలస్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఇఒ నాగేశ్వర నాయక్ తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం రాష్ట్ర జెవివి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఎంఇఒ అధ్యక్షతన విద్యార్థులకు మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహిం చారు. మొదటి స్థానంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెండవ స్థానంలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, మూడవ స్థానంలో యామవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు కరిష్మా, రవి చరణ్, మహిధర్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. జన విజ్ఞాన వేదిక కో-ఆర్డినేటర్ సృజన్‌కుమార్ మెమోంటో, మెడల్స్, సర్టిఫికెట్లు, పుస్తకం అందజేశారు. హెచ్ఎం రాజబాబు, సాంబశివారెడ్డి, ఉపాధ్యా యులు భాస్కర్, మాబు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : స్థానిక వేమారెడ్డి సత్రంలో చెకుముకి మండలస్థాయి పరీక్షలను మంగళవారం నిర్వహించారు. సమాజంలో మూఢనమ్మకాలను నిర్మూలించడమే జన విజ్ఞాన వేదిక ప్రధాన ఆశయమని వక్తలు పేర్కొన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి దేశాన్ని అభివృద్ధి దిశలో నడపడానికి తమవంతు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి విజేతలు వరుణ్ హైస్కూల్ నుండి ఎల్.శరణ్య, ఎ.శిల్ప, ఇ వరుణ్ సందేశ్, రెండవ విజేతలు దీప్తి హైస్కూల్ ఎస్ ప్రశాంతి, జి మోక్ష, జి కీర్తన్, మూడవ విజేతలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల న్యూ స్కూల్ రాజేంద్ర, కార్తీక్, వి.నరసింహ. పూర్వ ఉపాధ్యాయులు చింత రామి రెడ్డి, పూర్వ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, పెద్దలు అంకిరెడ్డిపల్లె ఓబుల్‌రెడ్డి, రాయపురెడ్డి లక్ష్మీనరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గండి సునీల్‌కుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నం, వసంతకుమారి, ప్రణయ్, ఓబుళపతి, చిట్టిబాబు, జెవివి మండల కార్యకర్తలు ఓబులేష్, రవి, పెద్దలు పాల్గొన్నారు.

చక్రాయపేట : చెకుముకి మండలస్థాయి పోటీలు చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జానవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలస్థాయి పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో చక్రాయపేట, మహదేవపల్లె, నాగలగట్టుపల్లె, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. విజయం సాధించిన నాగలగట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం జట్టు రోహిత్, లక్ష్మీ వెంకటేశ్వర, తేజస్, ద్వితీయ స్థానం జట్టు మహాదేవపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భావన, గంగా హాసిని, మాధురి, తృతీయ స్థానంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల జట్టు నరసింహులు, రుషి కుళ్లాయప్ప, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. వీరికి జెవివి జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగాధర్‌రెడ్డి, చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజులు ప్రశంసాపత్రాలను అందజేశారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : చెకుముకితో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిద్దేశ్వరరావు అన్నారు. జెవివి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీ తొగటవీరక్షత్రియ కల్యాణమండపంలో చెకుముకి మండలస్థాయి సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని పాఠశాలల నుండి 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రశ్నా పత్రాలను ప్రయివేట్ స్కూల్స్ సంఘ అధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ముఖ్యఅతిధిగా సిద్దేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గౌరవసలహాదారులు గోపీనాద్‌రెడ్డి కళ్యాణమండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, డాక్టర్ మురికూటి సూర్యనారాయణరెడ్డి మాట్లాడారు. ఇంఫెల్ రుహుల్లా, శంకర్ ఐఎఎస్ స్టడీ సంటర్ రవిశంకర్ విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ ఇచ్చారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, నాయకులు మురళీగుప్త, రాజేష్, దేవమణి, ఉషారాణి, మధు, మీనా, మౌనిక, హేమలత, కృష్ణవేణి, చైతన్య, డేవిడ్, బాలసుందర్, రవిబాబు, వెంకటరమణయ్య, గణేష్, తేజ, భరత్, సుందరమ్మ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జెవివి ఆధ్వ ర్యంలో మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించామని జెవివి మండల అధ్యక్ష కార్యదర్శులు దినేష్, రాజు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎంఇఒ శివ ప్రసాద్ విచ్చేశారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బాయన్న, కార్యదర్శి సుజన్‌కుమార్ దరియా, మండల నాయకులు జాకట దినేష్, తప్పెట జయరాజు, పీటర్ సైరో, ఉపాధ్యాయులు బాలకృష్ణ పాల్గొన్నారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం.. రైతులకు శాపం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేటలో పురుగు మందులు, ఎరువుల దుకాణదారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. దుకాణాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే బస్తాపై అధికంగా వసూలు చేస్తున్నారని, కొనుగోళ్లకు సంబంధించి బిల్లు కూడా ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. బిల్లు అడిగితే ఎరువులు, పురుగు మందులు ఇవ్వబోమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఫాస్పేట్ తీసుకుంటేనే యూరియా బస్తా ఇస్తామంటూ హెచ్చరికలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ ఉన్నతాధికారులు అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తున్నా దుకాణదారులు ఏమాత్రం అధికారులను లెక్కచేయడం లేదని పేర్కొంటున్నారు. ఎరువులు, పురుగు మందుల దుకాణదారులందరూ సిండికేట్‌గా మారి అందిన కాడికి రైతుల నుంచి దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు వారిపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని రైతులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఖాజీపేటలో ఎరువులు, పురుగు మందుల దుకాణదారుల ఆగడాలు, అక్రమాలకు అంతేలేకుండా పోయిందని రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలుకు సంబంధించి బిల్లు అడిగితే ఇవ్వకపోగా స్టాక్ లేదని అంటున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మాయమాటలతో గద్దెనెక్కిన బాబు : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మాయమాటలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఒకలా.. ఎన్నికలు అయ్యాక మరోలా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి తీవ్రంగా విమర్శించారు. స్థానిక వైసిపి నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాబు వంద రోజుల పాలన చూశాక బాబును ఎందుకు ఓట్లేసి గెలిపించామా అని ప్రజలు అనుకుంటున్నారన్నారు. అధికారంలోకొచ్చి 4 నెలలు అవుతున్నా అమ్మకు వందనం ఏమైందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచబోమని, అన్ని ధరలు పెంచేశారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే ఉద్దేశంలేక కాల యాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే మద్యం, ఎక్సైజ్ పాలసీ అమలు చేసేందుకు మాత్రం ఆఘమేఘాలపైన అధికారులను నాలుగు రాష్ట్రాలకు పంపి అధ్యయనం చేయించి వంద రోజుల్లోనే అమలు పరుస్తున్నారన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలకు మంచి చేసేందుకు మాత్రం కాలయాపన, చెడు చేసేందుకు మాత్రం నిమిషాల్లోనే నిర్ణయాలు అన్నారు. కరెంటు బిల్లులు పెంచేదిలేదని ఎన్నికల ముందు చెప్పారన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో సుప్రీం కోర్టు చంద్రబాబుకు మొటిక్కాయలు వేసినా బుద్ధి రాలేదన్నారు. ప్రజల సంక్షేమం కోసం భవిష్యత్తులో ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని రాచమల్లు అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - చాపాడు

నెహ్రూ యువ కేంద్రం, అమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థులతో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ కరీముల్లా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటిస్తే ఎలాంటి జబ్బులు దరిచేరవన్నారు. పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ సేవా సమితి అధ్యక్షులు వాగ్గాడం శివశంకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ సురేంద్ర నాయక్, సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సతీష్‌బాబు, డాక్టర్ నాగయ్య, డాక్టర్ శివకుమార్, ప్రవీణ, ఆనంద్‌రెడ్డి, ఇమామ్ పాల్గొన్నారు.

ఆర్‌టిడి కళాశాలలో..

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో ఉన్న చెత్తాచెదారాన్ని తీసేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎల్.తరుణ్ ఇంద్రశేఖర్, ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు 15 రోజులపాటు సుదీర్ఘంగా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నరన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు, డైరెక్టర్ సుబ్బారాయుడు, ఎఒ రాజు, కళాశాల ఎన్ఎస్ఎస్ లీడర్ ఎస్ దీక్షిత్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ముద్దనూరు : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య అన్నారు. పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఎల్ఎమ్ కాంపౌండ్, ఎస్వీ గిరి కాలనీలో సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అంగ న్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అవసరం మేరకే ఎరువులు ఉపయోగించాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎడిఎ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - చాపాడు

వరి పంటలో అవసరం మేరకు మాత్రమే యూరియా, ఇతర ఎరువులను ఉపయోగించాలని వ్యవసాయ శాఖ మైదుకూరు డివిజన్ ఎడిఎ కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని అయ్యవారిపల్లె, అనంతపురం గ్రామాల్లో మంగళవారం ఎఒ మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎడిఎ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అధికంగా రైతులు ఈ ఏడాది వరి పంటను సాగు చేపట్టారన్నారు. ప్రస్తుతం వరి పంట ఆశాజనకంగా ఉందన్నారు. అయితే రైతులు యూరియాను అవసరం కంటే అధికంగా వినియోగిస్తున్నారన్నారు. ఎఒ మ్యాగీ రైతులకు చీడ పీడల నివారణ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఏఏ భార్గవి, రైతులు మల్లికార్జునరెడ్డి, రవీంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

చక్రాయపేట : మండలంలోని మారెళ్ల మడక, తిమ్మారెడ్డిగారి పల్లె వరి పంట పొలాలను ఆత్మ డిపిడి, ఎంటమోలజీ శాస్త్రవేత్త, రైతు శిక్షణా కేంద్ర అధికారులు, మండల వ్యవసాయాధికారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పంటలను పరిశీలించారు. వరి పొలాలతో ఎండు తెగులు సమస్య ఉందన్నారు. కార్యక్రమంలో ఆత్మ డిపిడి పద్మలత, ఎంటోమాలజీ శాస్త్రవేత్త శిల్పకళ, రైతు శిక్షణా కేంద్రం అధికారి నాగభూషణరెడ్డి, ఎఒ నవంత్‌బాబు, ప్రకృతి వ్యవసాయ అధికారి ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పెద్దరంగాపురం గ్రామ పంచాయతీలో ఎఒ నాగలక్ష్మి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు అంకిరెడ్డి పత్తి పంటను పరిశీలించారు. రసం పీల్చు పురుగును గుర్తించి, నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి రాఘవేందర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ అధికారి భాస్కర్‌రెడ్డి సుబహానిబీ ఐసిఆర్‌పిఎస్, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో మంగళ వారం జాతీయ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ఎంతో మంచిదన్నారు. మెడి కల్ సూపరింటెండెంట్ రఫీక్‌పాషా మాట్లాడుతూ రక్తం దానం చేయడం వల్ల ప్రాణం కాపాడ వచ్చున్నారు. డాక్టర్ శ్రీలత, ఐసీటీసీ కౌన్సిలర్ ఇ.ప్రతాప్‌కుమార్ మాట్లాడారు. అనేకమంది రక్తదానం చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ నెల్సన్, మెడికల్ సిబ్బంది, బైరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో వైద్యాధికారులు, సిబ్బంది

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులకు ఎమ్మెల్సీ ఫోన్‌చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మైసూరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.



కౌన్సిలర్లును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపికి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ జిలాన్‌బాషా, 38వ వార్డు కౌన్సిలర్ పల్లా రమాదేవి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం టిడిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎపి అభివృద్ధి చంద్రబాబు సాధ్యమని నమ్మి వైసిపి కౌన్సిలర్లు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో సిబిఐ కేసులో జగన్మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం రూ.15 వేల కోట్లు ఇచ్చిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో దీపావళికి గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, టిడిపి నాయకులు సీఎం సురేష్ నాయుడు, ముక్తియార్, ఇవి సుధాకర్‌రెడ్డి, చౌటపల్లి లక్ష్మిరెడ్డి, అరవ మునివర, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - వేముల

స్థానిక ఎస్సీ బాయ్స్ హాస్టల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఐటిఐ, ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో పాఠశాలల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు ఆసం విశ్వేశ్వర్‌రెడ్డి, వేముల యూనిటీ ఇన్‌చార్జి కూనపూరి శివరాం, షేక్ బాబా, గట్టు సుధాకర్, రాంపుల్లయ్య పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత చంద్రబాబుదే

ప్రజాశక్తి - ఖాజీపేట

తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని, ఆ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు సిద్ధారం ఖదీరుల్లా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ముస్లిం కాలనీ, బీసీ కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలు, ప్రజలకిచ్చిన హామీల గురించి ప్రజలకు వివరిస్తూ కర పత్రాలను పంచారు. అంతరం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు.

ఎస్ఆర్ఐటి కళాశాలలో గెస్ట్ టాక్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం శివ సాయినిఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ హైదరాబాద్ ప్రొఫెసర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వి రమణ రావు ఎంబిఎ విద్యార్థులకు ఇంటర్ ప్రెన్యూర్ షిప్, మైండ్ సెట్ ఇన్ ద కార్పొరేట్ అనే అంశాలపై గెస్ట్ టాక్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ రవి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు, ఎంబిఎ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

ఆటో, బస్సు ఢీ : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - సిద్ధవటం

కడప-చెన్నై జాతీయ రహదారిపై మండలంలోని కనుమలోపల్లి సమీపంలో ఉన్న నీలకంఠేశ్వర స్వామి టెంపుల్ ఎదురుగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కడప నుండి తిరుపతికి వెళుతున్న నాన్‌స్టాప్ ఏపీఎస్ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు, రాజంపేట నుండి కడప ఇందిరానగర్ వెళుతున్న ఆటోకు తగలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటనలో అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలానికి చెందిన ఆటో డ్రైవర్ రామచంద్రయ్య, ఆటోలో ప్రయాణిస్తున్న నరసమ్మ స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన స్థలానికి హైవే పెట్రోల్ పోలీస్ సిబ్బంది ప్రథమ చికిత్స కోసం గాయపడిన వ్యక్తులను 108 వాహనంలో కడప రిమ్స్ తరలించారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు తగలలేదని పోలీస్ సిబ్బంది తెలిపారు. హైవే రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు విరిగిన రెండు కాళ్లు

వేంపల్లె : పెండ్లిమర్రి మండలంలోని యోగి వేమన యూనివర్సిటీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేంపల్లె పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాసులురెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాసులురెడ్డి సోమవారం రాత్రి విధుల నిమిత్తం విజయవాడకు కారులో బయల్దేరాడు. యోగి వేమన విశ్వవిద్యాలయం సమీపంలోకి రాగానే కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. కారును డ్రైవింగ్ చేస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాసులురెడ్డికి రెండు కాళ్లు విరిగాయి. తీవ్రంగా గాయపడిన ఆయనను వెలూరు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.